# జరీఅంచు తెల్లచీర

జరీ అంచు తెల్ల చీర!

విశాలాక్షికి ఏడుపు వస్తోంది.

గదిలో కుక్కి మంచంలో కూలబడి చూస్తోంటే, ఎదట కొట్లో, హరికేన్ లాంతరు గుడ్డి వెలుగులో, ఫిజిక్స్ పాఠం చదివే అన్నయ్యా, పదమూడో ఎక్కం కంఠస్థం చేసే తమ్ముడూ కనిపిస్తూనే వున్నారు.

రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

వెనక వరండాలో నిద్దర పట్టక అమ్మ దొర్లుతోన్నట్లుగా ఉంది. చిన్న తమ్ముడు మధ్య మధ్య ఏడుస్తున్నాడు. అగ్గిపెట్టె కోసం కాబోలు, నాన్న అటూ యిటూ తిరుగుతున్నాడు.

జరీఅంచు తెల్లచీర!

ఎప్పుడు కొనడం? ఎప్పుడు కట్టుకోడం?

ఏమో! ఎప్పుడో!

ఎప్పటినుంచో వస్తోన్న ఈ తీరని కోరిక ఎప్పుడు తీరుతుంది?

ఎప్పుడో! ఏమో!

ఎప్పుడో ఒకప్పుడు ఆ కోరిక తీరకపోదనే అనుకొంది.

ఆ కోరిక తీరాలనే అనుకొంది ఈనాటి వరకూ.

కాని, ఈ రోజు మాత్రం...

ఈ నాటికి పదేళ్ళ క్రితం...

ఆరేళ్ళ విశాలాక్షి సినిమాకి వెళ్ళింది.

అది ప్రప్రథమం, సినిమాహాల్లో అడుగుపెట్టడం.

విశాలక్షి విశాలాక్షయింది.

ఆశ్చర్యం? ఆనందం? కాదు;

మైకం!

ఆట ఇంకా ఆరంభం కాలేదు.

ఆరేళ్ళ కళ్ళని హాలంతా గిర గిర తిప్పే విశాలాక్షికి, ఆఖరి వరస కుర్చీల్లోకి అప్పుడే వస్తోన్న "ఆవిడ" కనిపించింది.

ఎవరావిడ?

"ఆవిడ!" అంతే.

హాలునిండా ఉండే దీపాల్లోకి దీపంలా వస్తోందావిడ.

నవయౌవన విలాసిని. సుమధుర హాసిని. శుభ్రజ్యోత్స్నాంబరధారిణి.

తెల్లటి మనిషి మెల్లగా నడుస్తూ వస్తోంటే, ఆమె కట్టుకున్న వెన్నెల్లాంటి తెల్లచీర తళ తళా మెరుస్తోంది.

"అమ్మా! నా కలాంటి చీర కొనవే!"

"ఇష్ నోర్ముయ్!"

ఇంతలో దీపాలు ఆరడం తెరమీద బొమ్మలు కదల్డం జరిగాయి.

కృష్ణుడి పాట, గోపికల నాట్యం.

తెల్లగా వెలిగేవి గోపికలు కట్టుకున్న తెల్ల చీరలు.

తళుక్ తళుక్ మనేవి ఆ చీరల జరీ అంచుల తళుకులు.

సినిమా ఆయాక, బైటకి వచ్చాక, మళ్ళీ

"అమ్మా! నాక్కొనవూ అలాంటి చీరా!?"

"ఇప్పణ్ణించీ కోరికలు బావున్నాయే తల్లీ! కొంటాంలే నీ పెళ్ళినాడు."

"ఎప్పుడే, ఎప్పుడే అమ్మా?"

అమ్మా వాళ్ళూ నవ్వేరా?

నవ్వేరు.

విశాలాక్షికి ఏడుపు వస్తోంది.

ఆరేళ్ళ ఆడపిల్ల కోరిన కోరికే పదహారేళ్ళు ఎదిగిన ఆడపిల్ల కూడా కోరుతూ వచ్చింది.

ఈ కోరిక్కి వచ్చేయి పదేళ్ళు.

ఈ కోరికలన్నీ ఇలా పెరిగి పెద్దవయి చివరికి...

విశాలాక్షికి ఏడుపు వస్తోంది.

జరీఅంచు తెల్ల చీర!

"కొందాంలే" అనేసేవాడు నాయన.

నాన్న నోట్లో ఉండేది చుట్ట, అతని మనసులో ఉండేది పొగ. అతనికి ఉన్నది ఉద్యోగమా? అబ్బే! నౌఖరీ! అతని చేతిలో లేనిది.

"ఉన్నప్పుడు ఎప్పుడో ఒకప్పుడు కొంటాలే"

ఎప్పుడో ఒకప్పుడు శుభముహూర్తం వస్తుందని విశాలాక్షి చూస్తూనే వచ్చింది.

ఎంతో కాలం నుంచి ఎన్నెన్నిటికోసమో ఈ విశాలాక్షి చూస్తోనే ఉంది.

ఈ విశాలాక్షి సజలనయనగా, వ్యర్థంగా... ...విశాలాక్షికి ఏడుపు వస్తోంది.

జరీ అంచు తెల్లచీర!

"ఎన్ని ఖర్చులున్నాయో... నువ్వెరగవా... మీ నాయన చచ్చి చెడి... ఆ నాలుగురాళ్ళూ... ఏదో అదీ ఇదీ ... జాగ్రత్తచేసి ...తంటాలు పడకపోలేదు....చూడూ... ఈ ఏడు నీ పెళ్ళి ... చెయ్యక తప్పదు కదా... నీకు నచ్చిన చీరలు... కొనకపోతే అలా అను."

అని ముగిస్తుంది తల్లి.

"ఎవ్వర్నీ ఏదీ అడగను"

అని ఎన్నోసార్లు నిశ్చయించుకొంది విశాలాక్షి.

ఫలానాది కావాలని ఎవర్నడిగినా వాళ్ళకుండే బాధలన్నీ వెళ్ళబుచ్చక తప్పదు.

వాళ్ళలా చెపుతూంటే ఇంకా బాధగా ఉంటుంది విశాలాక్షికి.

కాని అడక్కుండా ఉండలేదు.

"మళ్ళీ ఏదైనా అడిగేవంటే చూడు. చమ్డా లెగరగొడతాను" అని-తిట్టి, కొట్టి, వళ్ళు హూనంచేసినా అంత బాధగా ఉండదు.

వాళ్ళలా చెపుతూంటే మాత్రం ఏడుపు వస్తుంది. కాని-ఏడుస్తే ఒకప్పుడు సంతృప్తిగా ఉంటుంది. అందుచేత-

ఏడ్చి సంతృప్తిచెందడానికి మళ్ళీమళ్ళీ అడుగుతూనే ఉండేది విశాలాక్షి.

ఒక్క జరీ అంచు తెల్లచీర!

విశాలాక్షికి ఏడుపే వస్తోంది.

అమ్మ చెప్పేమాటలు వింటే, చూస్తే-

పెళ్ళొడ్డం అనేటంత పనయితేనేగాని ఈ విశాలాక్షికి దొరకదు జరీ అంచు

తెల్లచీర!

-ఛీ! నేను పెళ్ళే చేసుకోను.

కాని-

కట్టుకుందికి గుడ్డముక్కా; రెండుపూట్లా ఇదంత తిండీ; వీటికోసం ఆడపిల్ల పెళ్ళిచేసుకోక తప్పదు.

తప్పదా?

-తప్పకపోయినా సరే; ముష్టయినా ఎత్తి బతుకుతుకు తాను గాని పెళ్ళిమాత్రం చేసుకోను.

పెళ్ళాడకపోతే నువ్వు ముష్టే ఎత్తవలసి ఉంటుంది. నీకు డబ్బూ లేదు; చదువూలేదు.

-హవు న్నిజం!!

ఈమెకి పాటయినా రాదు. ఈమె గుడ్డిదైనా కాదు. ఈమెకి శక్తయినా లేదు. మరి, లోకానికి దయన్నది లేదు.

విశాలాక్షికి ఏడుపువస్తోంది...కాని...కాని...

-ఏమైనా సరే నేను పెళ్ళిచేసుకోను. చే...సు... ...కో...ను...

విశాలాక్షి పళ్ళు కొరికింది.

-అందులోనూ అందరూ అలాంటి వెధవలే!

తెల్లచీర జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా అమ్మ చెప్పే పెళ్ళి మాట జ్ఞప్తికివస్తుంది. పెళ్లిమాట తలపుకి వచ్చినప్పుడు ఆ వెధవ తలపుకి రా రాకుండా ఉండడు.

వాడే కనకారావు. అన్నయ్యకి క్లాస్ మేటు.

వెధవ!

వాడా నీకొక ఫ్రెండని యెంత చెప్పినా అన్నయ్య వినడు. కాఫీ ఇప్పించేదివాడు. సినిమాలకి తీసుకువెళ్ళేదివాడు.

ఇహ, వాడితో తిరగవద్దని ఎంత చెప్తే మాత్రం ఆ అన్నయ్య ఎందుకు వింటాడు?

కాని, విశాలాక్షి మాట విశాలాక్షి ఎలా యెవ్వరితో చెప్పగల్దు?

ఒకనాటి సాయంకాలం,

ఆరుగంటల మసక చీకట్లో,

అన్నయ్య ఇంటిదగ్గర లేనప్పుడు, నాన్న యింకా ఇంటికి రానప్పుడు, తమ్ముడు ఎక్కడికో వెళ్ళినప్పుడు, వంటగదిలో అమ్మ వండుతూన్నప్పుడు,

దొంగలా వచ్చిన కనకారావు,

"మీ అన్నయ్య ఉన్నాడా?" అని మెల్లిగా అడిగేడు.

"లేదు" అని గట్టిగా చెప్పింది విశాలాక్షి.

"అయ్యో! ఎలాగా! వాడిగదిలో నా పుస్తకా లుండిపోయాయే!"

"అన్నయ్యొచ్చాక తీసుకోవచ్చు."

నవ్వితీరాలనే పట్టుదలతో కనకారావు నవ్వుతున్నాడు.

"వీడియెదట నవ్వకూడదు" అనే నిశ్చయానికి అతణ్ణి చూసిన మొదటిరోజునే వచ్చింది విశాలాక్షి.

చేసేదేమీలేక వాడు వెళ్ళిపోతూండగా,

అమ్మ వేసిన కేక!

"ఎవరే వారూ?"

"అన్నయ్య ఫ్రెండు"

అనే మాటల్లో ఎంత నిరసన చూపించాలో అంత నిరసన చూపించింది విశాలాక్షి.

"ఎవరు, కనకారావా! అయితే, చిన్నకొట్లో కూర్చోపెట్టు. అన్నయ్య ఇప్పుడే వస్తానన్నాడు."

వెళ్ళిపోయే శనిగ్రహం అంతటితో వక్రించి వెనక్కి వచ్చింది.

అమ్మకి తెలీదు. పట్టి సత్యకాలం!

సాటికులంవాడు. గొప్పవాడు. చదువు కొంటున్నాడు.

మా పిల్లని చేసుకుంటే బావుణ్ను.

– అంతే అమ్మ ఉద్దేశం

మంచి చేసుకుంటే మంచిదనీ, అందుచేత మంచి చేసుకుందామనీ అమ్మ తాపత్రయం

ఆ ఉద్దేశంతో, ఈ తాపత్రయంతో, నాన్నకి ఉంచిన కాఫీ పట్టుకువెళ్ళి వాడికి ఇమ్మంది.

–అయ్యయ్యో, అమ్మకేం తెలుసు?!

ఈ విశాలాక్షి కోపాన్ని ఆపలేదు. కన్నీటిని కట్టలేదు.

పిల్లని పెళ్లాడతాడేమోనని అమ్మ ఆశ.

అయినా–

-కనకారావునా నే పెళ్ళాడేది?!

అయినా-

కనకారావా పెళ్ళాడేది?

అలాంటి ఫకీరు వెధవలు పెళ్లాడరు.

ప్రేమలేఖలు రాస్తారు. తెరచాటున విజృంభిస్తారు.

అమ్మకి తెలీదు.

తల్చుకొంటూంటే విశాలాక్షి వళ్ళు దహించుకుపోతోంది.

చీకట్లో చెంగుపట్టుకున్న ఫకీరు వెధవ...

అయ్యా, ఈ ఎడమభుజం ఎందుకు తెగ్గొట్టరు!!

హయ్యా, ఈ కుడిభాగం ఎందుకు ఛేదించరు!!

ఈ పెనుమంట ఏడుపుతో చల్లారదు.

విశాలాక్షిని ఏడవనీయ దీ పెనుమంట.

కాని, విశాలాక్షికి వస్తోంది ఏడుపు.

-నాకు పెళ్ళయినా అయింది కాదు. ఏ ఒక్కడైనా సాయపడ్డానికి నా కయిదుగురు భర్తలైనా ఉన్నారుకారు.

ఈ కీచకుడి పీడ మడంచడానికి ఎవడున్నాడు?

ఎవడూ లేడు?

ఎవరితో చెప్పుకోడం?

ఎవరితోనూ లేదు!

పాపాత్ములందరిమీదా ఒక్క పిడుగైనా పడదు.

పడ్డ అవమానంగురించి చెప్పుకునే శక్తయినా లేదు ఆడదానికి. చెప్పుకున్నా, శక్తిగల మగాడు కనిపించనైనా కనిపించడు.

ఆడపిల్లమీద,

తెరచాటున సాహసం, చీకట్లో పరాక్రమం

ప్రదర్శించిన కనకారావు

ఏమీ జరగనట్టు, ఏం జరిగినా ఫరావాలేదన్నట్టు,

ఠీర విరుచుకు నడుస్తూనే ఉన్నాడు.

వాడిచ్చిన కాఫీ తాగి, వాడు చూపించిన సినిమాలు చూస్తూనే ఉన్నాడు అన్నయ్య.

విశాలాక్షికి ఏడుపు వస్తోంది.

జరీ అంచు తెల్లచీర!!

ఫకీరు వెధవ కనకారావు!

-వాడి గురించి తల్చుకోను.

కాని, ఈ మంట చల్లారదు.

వాడికీ, తెల్లచీరకీ సంబంధం యేముంది?

విశాలాక్షికి తెలీదు.

కాని, ఏదో సంబంధం వుంది.

అంతా బీరకాయ పీచు, ఒంటిగీత బొమ్మ.

విశాలాక్షి పరిస్థితికి, హీనస్థితికి, దౌర్భాగ్యానికి, కారణం? కారణం?

ఏవేవో కారణాలున్నాయి. అవేవీ విశాలాక్షికి తెలీవు.

కాని, ఆ కారణాలన్నింటికీ కనకారావునొక "సింబల్"గా చేసుకొంటున్నట్లుగా కూడా విశాలాక్షికి తెలీదు.

తెల్లది, జరీ అంచుది, ఒక్క చీర ఉంటేనా?

కనకారావు రక్తంలో ముంచనా!

ఈ లోకాన్నే జయించనా!

ఒక్కటి, ఒక్కటేనండీ, ఒక్కటే!

విశాలాక్షి ఎన్నటికీ యేడవదు.

కాని, ఏడుపే వస్తోంది విశాలాక్షికి. ఆ నాడు సినిమా హాల్లో కనిపించినావిడ ఎక్కడుంది? తెరమీద గోపికలు ఏమయేరు? జరీ అంచులన్నీ ఎక్కడ పడుకున్నాయ్? తెల్లచీర లన్నీ యేవీ యెక్కడ? విశాలాక్షికి ఎందుకీ ఆవేదన?

మంచం కుక్కలోంచి లేదామనుకొన్న విశాలాక్షి లేవలేక అలానే కూలబడి కూర్చొంది.

అన్నా తమ్ముడూ చదువుకొనే గదిలో హరికెన్ లాంతరు మినుకు మినుకు మంటోంది.

ఆ గుడ్డిదీపం దగ్గర వాళ్ళెలా చదువుతున్నారు? కట్టుకొందికి మంచిగుడ్డముక్క లేకుండా నేనెలా తిరగ్గలుగుతున్నాను? అమ్మకి యేల నిద్దురపట్టదు? నాన్నకి అగ్గిపెట్టెలు ఎందుకు దొరకవు? ఈ మంచం ఎందు కింత కుక్కగా ఉంది? ఇందులో నేనెందుకిలా ఉన్నాను?

విశాలాక్షికి యేడుపు వస్తోంది.

ఒక్క తెల్లచీర-నేతదే-నూలుదే-కాని-జరీ అంచుది!

"పోనీ, మామూలు తెల్లచీర కొనుక్కోరాదటే" అనేది అమ్మ.

"నా కక్కర్లేదు. అంతగా కావాలని నే నన్నానా ఏం. యేవో చీరలున్నాయి కదా! కట్టుకుంటున్నాను. చాలు"

"నీకు ఊఁ అంటే పౌరుషం, ఆఁ అంటే పౌరుషం కాని నే నెరగన్టే నీకు తెల్లచీర కావాలనుందనీ! పోనీ, తెల్లవాయిలు కొంటానూ! నీకు నచ్చిన అంచు అద్దకం చేయించుకొందువుగాని. యేం?"

"నాకు అ క్క ర లే దు."

"అయితే, పోనీవే? నీ తత్వం యేమిటో నా కర్థంకాదు"

యేవో రంగుచీరలు కట్టుకొంటూనే ఉంది విశాలాక్షి.

కాని-

తెల్లదే కట్టుకున్నప్పుడు జరీ అంచుదే కట్టుకోవాలి!

అదొక తియ్యటి కోరిక.

నెరవేరదా?

పోనీ!

అంతేకాని-

కోరాసైను! తెల్లవాయిలు! అద్దకపుటంచు!

యెప్పటికీ పెళ్ళికాక మూడోపెళ్ళి వాణ్ణి చేసుకున్నట్టు!

అలా-

మూడో పెళ్ళివాడు తలపులోకి రావడంచేతనే ఆసైనూ, ఆ వాయిలూ అక్కర్లేదంటుంది విశాలాక్షి.

అర్థంకాదు, ఎవ్వరికీ అర్థంకాదు.

తలబాదుకున్నా, ఎవ్వరికీ అర్థంకాదు.

మంచంకోడుకి తలవేసి కొట్టుకోవాలనీ, గోడకివేసి తల బద్దలు చేసుకోవాలనీ, మనుష్యులందర్నీ చంపాలనీ, లోకానికి నిప్పుపెట్టాలనీ ఉంది విశాలాక్షికి.

యేడవకుండా ఉండాలనుంది విశాలాక్షికి.

కాని, ఈరోజు సాయంకాలం విషయం తలపులోకి వస్తోంటే యేడవకుండా ఉండలేదు విశాలాక్షి.

సాయంకాలం నాన్న -

"అమ్మా! బజారుకి వెళ్దాం రావే"

"ఎందుకు నాయనా?"

"తెల్ల చీర కావాలంటున్నావు కాదుటే!"

"నాయనా"

"బయల్దేరవే"

"ఊరకే అనేదాన్ని నాయనా! నా కక్కర్లేదు."

"పదవే, వెర్రిదానా! మళ్ళీ చేతిలో చిల్లిగవ్వుండదు"

అని అతను అన్నప్పుడు విశాలాక్షికి ఏడుపే వచ్చింది. ఎప్పుడో యెక్కడో విన్న విషాదగాథలన్నీ తలపులోకి వచ్చేయి. స్మృతి పథాన్నుంచి జారిపోయిన విషాద దృశ్యాలన్నీ దారికి అడ్డుగా నిల్చేయి.

ఆస్పత్రి ఎదట, చెట్టుక్రింద, ఒకదినం మధ్యాహ్నం చూసిన పడుచుపిల్ల శవం, పెత్తల్లికూతురు నూతిలోపడిందని ఒకనాటి సాయంకాలం దీపాలు పెట్టేవేళ వార్త తీసుకువచ్చిన నలిగిన ఉత్తరం, మేడమీంచి పడిన మేస్త్రీకోసం ఏడ్చిన ఎదటింటి మనిషి, కడుపులో బల్లతో చనిపోయిన పక్కింటిపిల్లడు, అనకాపల్లినుంచి రాత్రి ట్రెయిన్‌లో వస్తూ కిటికీలోంచి చూసిన చీకటికొండలు, ముసురుపట్టిన రోజులు, దీపాల్లేని రాత్రుళ్ళు, ఇటువంటివన్నీ ఎందుకు జ్ఞప్తికి రావాలి?!

ఈ రోజు సాయంకాలం-

గోడవైపు తిరిగి కంటనీరు పెట్టడానికి కారణం అవన్నీ జ్ఞప్తికి రావడమే కాదు.

ఇంకోటికూడా ఉంది.

అది ఉండబట్టే అవన్నీ స్ఫురణకు వచ్చేయి.

అది-

రక్తం!

బజారుకి వెళ్దామన్న మనిషి బజార్లోయివ్వబోయేది డబ్బు కాదు; నెత్తురు.

అతనిముఖం చూస్తేనే తెలుస్తుందా విషయం.

రక్తం ధారపోస్తేనేగాని తీరనికోరికలు నా కక్కర్లేదు.

విశాలాక్షికి యేడుపు వస్తోంది.

"ఉత్తినే అనేదాన్ని. నిజం నాకలాంటి చీర అక్కర్లేదు" అని యేడ్చి చెప్పినా నమ్మరెవ్వరూ.

"పద పద! వెల్తురుండగానే వెళ్ళడం మంచిది."

కొత్తచీర కొనుక్కుందికి, ఉతికిన చీర కట్టుకొని బయల్దేరిన విశాలాక్షి యేడ్చిందని ఎవరికైనా తెలుసా?!

ఇద్దరూ బయల్దేరేరు. వెళ్ళేరు.

కూతుర్ని వెంటబెట్టుకొని అతను బజారుకు వెళ్ళడం చాలాకాలాని కది మొదటిసారి.

రాత్రివేళ దీపం వెలుగులో తెలుపు పక్కన పెడితేనే గాని పసుపురంగేదో సరిగా తెలియనట్టు, ఇంట్లో వుండే లేమి నలుగురు మధ్యకీ వెళ్తేనేగాని సరిగా కనిపించదు.

విశాలాక్షి కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

ఇంట్లో ఎంతో గంభీరుడిగా కనిపించే ఆమె తండ్రి వీధిలో ఎందుకంత దీనుళ్ళా కనిపిస్తున్నాడో ఆమెకి అర్థం కాలేదు.

ఇంత నీరసంగా ఎందుకున్నాడు? ఇంత దారిద్ర్యం ఎక్కణ్ణించి ముంచుకొచ్చింది? జీవం ఉండీ లేనట్టుగా యిలా ఎలా నడవగలుగుతున్నాడు?

నడిరోడ్డు కాబట్టి కన్నీరైనా కార్చకుండా ఏడవ్వలసి వచ్చింది విశాలాక్షి.

"నాకీ జరీ అంచు తెల్లచీర అక్కర్లేదంటే యెందుకు నమ్మరు వీళ్ళంతా."

నా క్కావాలి; కాని నిజంగా నా కక్కర్లేదు.

అతను నడుస్తున్నాడు. కొంచెం వెనగ్గా విశాలాక్షి.

అతని దగ్గర ఉన్నది పన్నెండు కాబోలు, అంతకంటె యెక్కువ మాత్రం కాదు.

ఏ దుకాణంలో అడిగినా, కావలసిన చీర కనీసపు ఖరీదు ఇరవై.

షాపులు ఎక్కేరు. షాపులు దిగేరు.

నడిరోడ్డుమీదనో, లేక యే దుకాణంలోనో, ఏక్షణాన్న ఉప్పెనగా యేడుపు వస్తుందోననే భయంతో అగ్నిపర్వతాన్ని అణచుకొని, గోదావరి వరదని ఆపుకొని నడుస్తోంది విశాలాక్షి.

ఈ సాయంకాలం గురించి తల్చుకొంటూంటే చచ్చిపోవాలనిపిస్తోంది విశాలాక్షికి, వళ్లు మండిపోతోంది విశాలాక్షికి.

అందులోనూ ఆఖరి షాపువాడు!

మరొక కనకారావు!

లోకంలో కనకారావుల్ని ఇట్టే పసిగట్టగలదు విశాలాక్షి. వాడో కనకారావని వాడిముఖం చూస్తేనే తెలుస్తోంది.

కాని, వాడెందుకలా ఎంతో కాలం నుంచీ ధుమధుమ లాడుతున్నట్లుగా ఉన్నాడు? తెల్లదొరల పాలన పోయిందనీ, షాపుకి సీమదొరలు రావడంలేదనీ వాడికి కోపంగా ఉన్నదని విశాలాక్షి కేం తెలుసు?!

అతనికే గాని శాసనాధికారం ఉంటే సీమదొరలూ, ఐ.సి.యస్ ఆఫీసర్లూ, మహారాజులూ తప్పించి వేరెవ్వరూ తన షాపుకి రావడానికి వీల్లేదని శాసించగలిగినవాడు ఆ షాపువాడు.

ఆ సంగతి విశాలాక్షికి తెలీదు. ఆమెతండ్రికీ తెలీదు. కాని, ఆషాపుముఖం చూస్తేనే వెళ్ళాలనిపించలేదు.

"ఒద్దు నాన్నా! అది గొప్పషాపూ."

"ఇంతదూరం వచ్చేం కదా! పోయి చూద్దాం రా."

షాపువాడే కాదు కనకారావు. వాడి నౌఖర్లందరూ కూడా కనకారావులే.

అమాంతంగా కాళ్ళువచ్చి నడుచుకొచ్చిన చెత్త డబ్బాని చూసినట్టుగా వాళ్ళంతా తనతండ్రిని చూశారని విశాలాక్షికి తెలుసు.

విశాలాక్షిని వాళ్ళంతా యే దృష్టితో చూశారో కూడా విశాలాక్షికి తెలుసు.

విశాలాక్షికి అవమానం భరించే శక్తి లేదు.

శక్తి లేకపోయినా భరించి తీరాలి.

విశాలాక్షి దహించుకుపోతోంది.

"సిల్కుచీరలు కావాలా?" అని అడిగేడు షాపువాడు.

ఆ మాటల్లో వెటకారం లేదన్న వాళ్ళ గుడ్లు పీకేస్తాను.

అందుకు, విశాలాక్షి తండ్రిః

"అబ్బే..." అని ఆరంభించేడు.

ఆ "అబ్బే"ని ఉచ్చరించడంలో యెందుకంత దౌర్భాగ్యాన్ని ధ్వనించడం?

అందులోనే ఎందుకంత సిగ్గు? ఎందుకంత భయం?

"అబ్బే ...నేతచీరలు ...తెల్లవి ...కాస్త జరీ... చూపిస్తే చాలు..."

వద్దు వద్దు. పోదాం.

అని ఎలా చెప్పడం?

సూదిమేకులమీద, ముళ్ళడొంకలమధ్య నిల్చున్నట్టుగా నిల్చొంది.

ఇంతలో, వాడు చీరలమేటిలోంచి పైకితీసేడు.

జరీ! జరీ! జరీఅంచు తెల్లచీర.

తాచుపాముని చూసినట్టుగా జడుసుకొంది విశాలాక్షి.

దూరంగా, దూరంగా, ఈ విషాన్ని దూరంగా తీసేయండి.

"ఎంతండీ?"

"ఇరవై రెండు"

అతను జంకిజంకి, భయపడి భయపడి,

"కొంచెం... కొంచెం అయినా... తగ్గదంటారా?" అనేసరికి-

"ఇదేం శుక్రవారం సంతకాదు, బేరాలాడ్డానికి" అనే మాటల్తో కొట్టేడు వాడు.

దెబ్బ తగలగానే కదలడానికి భయపడ్డ నాన్న;

"పోనీ... మరోరకం... కొంచెం తక్కువ ఖరీదువి..." అనేలోపునే వాడు,

"లేవండీ బాబుగారూ, లేవు" అని అవమానకరమైన అతిమర్యాదతో అన్నాడు.

షాపంతా అతి నిశ్శబ్దం.

వాడు వెటకారంగా నవ్వనైనా నవ్వలేదు.

కనకారావులు నవ్వకుండానే అవమానించగలరు.

ఈ కనకారావుల నెత్తురు చూడ్డం ఎప్పుడు?!

అందులో నా తెల్లచీర తడపడం ఎప్పుడు?!

క్రోధజ్వాల విశాలాక్షిని దహించేస్తోంది.

షాపుబైట-

దెబ్బతిన్న గొడ్డులా కనిపించే ఈవృద్ధుడెవ్వరు?

"నేవద్దంటే ఎందుకు విన్నావుకాదు నాయనా."

"అంత ఖరీదు లుంటాయనుకోలేదే."

నెత్తురే ఖరీదుగా ఇచ్చినా దొరకని వస్తువులు!

దహించుకుపోయే విశాలాక్షిని ముంచేయడానికి వస్తోంది, ఉప్పెన.

ఒక్క జరీఅంచు తెల్లచీర!

కుక్కి మంచంలో కూలబడి కూర్చొన్న విశాలాక్షి కొట్టుకుపోతూ చూస్తోంది.

ఇంట్లో,

కష్టపడి కష్టపడి వెలిగే "తుపానుదీపం"; ఫిజిక్స్ పుస్తకం చిక్కుల్లో ఇరుక్కున్న అన్నయ్య; పదమూడో ఎక్కం గతకల్లో పడిలేచే తమ్ముడు; నిద్దర పట్టని తల్లి; అగ్గిదొరకని తండ్రి; ఏడవకుండా ఉండని చిన్నతమ్ముడు....

విశాలాక్షికి ఏడుపు వస్తోంది.

అన్నయ్యకి ఫిజిక్స్ పాఠం అర్థంకాదు. తమ్ముడికి పదమూడో ఎక్కం చస్తేరాదు. అమ్మకి నిద్దర పట్టడం అనేది ఉండదు. నాన్న అగ్గికోసం వెతుకుతూనే ఉంటాడు. చిన్న తమ్ముడు ఏడవక తప్పదు. ఈ వెలగలేని దీపం ఎంతో సేపు వెలుగదు.

– నే నేడవను,

అనుకొన్న విశాలాక్షికి మరింక ఆగకుండా యేడుపు వస్తోంది.

కుక్కిమంచంలో కూలబడి కూర్చొన్న ఈ పదహారేళ్ళ ఆడపిల్ల ఈ విశాలాక్షి ఏకధారగా, వరద వరదగా ఏడుస్తోంది.

ఇది మెరుపులేని మబ్బు. ఇది తెరిపిలేని ముసురు. ఇది ఎంతకీ తగ్గని ఎండ. ఇది ఎప్పటికీ తెల్లవారని చీకటిరాత్రి. ఇది గ్రీష్మం. ఇది శిశిరం. ఇది దగ్ధంచేసే దావానలం. ఇది ఒక్కర్ని రాల్చేసే నైరాశ్యం-

ఒక్కటి! ఒక్కటే సుమండీ! ఒక్క

జ రీ అ ం చు తె ల్ల చీ ర !

ఆంధ్రపత్రిక (వారపత్రిక) 21-10-1953.